అడుగడుగునా గుంతలు..


గణపవరం సెంటర్‌లో భీమవరం రోడ్డుపై ఏర్పడిన గుంతలు

గణపవరం: గణపవరం నుంచి భీమవరం వెళ్లే ప్రధాన రహదారి అడుగడుగునా గుంతలతో నిండి ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఈరోడ్డు గణపవరం సెంటర్‌లోని పోలీస్ ఐలెండ్ కూడలి నుంచి ప్రారంభం అవుతుంది. రోడ్డు ప్రారంభంలోనే గణపవరం నడిబొడ్డునే అడుగులోతు గుంతలు ఏర్పడి, వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా ఉంది. మూడు రోడ్ల కూడలి కావడంతో గుంతల కారణంగా వాహనాలు నెమ్మదిగా వెళ్లడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. గత ప్రభుత్వ హయాంలో గుంతలు పూడ్చినా మళ్లీ అవేగోతులు ఏర్పడ్డాయి. భారీ వర్షాలకు గుంతల్లో నీరు నిల్వ ఉండటం, వాహనాలు ఆ గుంతల గుండానే రాకపోకలు సాగించడంతో ఆ గుంతలు భారీగా మారి ప్రమాదకరంగా తయారయ్యాయి. ఐదారు నెలలుగా ఇదే పరిస్థితి నెలకొంది. అక్కడి నుంచి భీమవరం వెళ్లే వరకూ రోడ్డు నిండా గుంతలే. ముఖ్యంగా గణపవరం బాలయ్య చెరువు వద్ద, సరిపల్లె, సీపీఎఫ్ ఫ్యాక్టరీ, ఆరేడు, కోలమూరు, పాముల పర్రు, ఉండి గ్రామాల ఏరియాలో రోడ్డు గుంతలమయంగా తయారైంది. దీంతో కాస్త చీకటి పడితే చాలు వాహనదారులు బిక్కు బిక్కు మంటూ ప్రయాణాలు సాగిస్తున్నారు.

తరచూ ప్రమాదాలు

ఎదురుగా వచ్చే వాహనాల హెడ్‌లైట్ల కాంతికి రోడ్డు మీద గుంతలు కనిపించక ద్విచక్ర వాహనదారులు గుంతల్లో పడి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఇటీవల రాత్రి 7 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న దంపతులు రోడ్డు మధ్యలో ఉన్న గుంతలో పడటంతో భార్యా భర్తలకు తీవ్ర గాయాలై ఆసుపత్రి పాలయ్యారు. గత నెలలో ద్విచక్ర వాహనంపై గణపవరం వస్తున్న ఆరేడు గ్రామానికి చెందిన యువకుడు రోడ్డు మీద గుంతలో పడటంతో ఎగిరి రోడ్డు మీద పడి తలకు తీవ్ర గాయాలై మృత్యువాత పడ్డాడు. ఇలాంటి సంఘటనలు అనేకం చోటు చేసుకున్నాయి. ఈ రోడ్డు మీద నిత్యం ప్రయాణించే వాహనదారులకు ఎక్కడెక్కడ ఎలాంటి గుంతలున్నాయన్న విషయం కొంత మేర అవగాహన ఉండటం వలన వారు జాగ్రత్తగా గుంతల భారిన పడకుండా ప్రయాణాలు చేస్తున్నారు. అయితే కొత్తగా ఈ రోడ్డు మీద వెళ్లే వారికి మాత్రం గుంతలపై అవగాహన లేక అమాంతం వాహనం టైర్లు గోతుల్లో దిగి వాహనదారులు రోడ్డు మీద పడి గాయపడుతున్నారు. ఒక్కో సందర్భంలో ప్రాణాలు కోల్పోవడమో, ప్రాణాల మీదకు తెచ్చుకోవడమో జరుగుతుంది. ఇప్పటికైనా అధికారులు తక్షణ చర్యలు తీసుకుని గుంతలు పూడ్చి తమను కాపాడాలని వాహనదారులు కోరుతున్నారు.


సరిపల్లె ఆరేడు మధ్య గుంతలతో నిండిన రహదారి


వాహన చక్రం ఈ గోతిలో దిగితే అంతే సంగతులు


భీమడోలు: భీమడోలు జంక్షన్ నుంచి సంతమార్కెట్ వరకు గుంతలతో ఉన్న ఆర్‌అండ్‌బీ రహదారి

అధ్వానంగా అర్‌అండ్‌బీ రహదారి

భీమడోలు: గుంతల రోడ్డు ఆర్‌అండ్‌బీ అధికారుల పనితీరుకు నిదర్శనంగా నిలుస్తుంది. గుంతలు పడిన రోడ్డుపై వాహన చోదకులు పడుతున్న వెతలు ఇంతా అంతా కావు. భీమడోలు జంక్షన్ నుంచి సంతమార్కెట్ వరకు రెండు కిలోమీటర్ల ఆర్‌అండ్‌బీ రోడ్డు అధ్వానంగా మారింది. ఆరునెలల క్రితం లక్షలాది రూపాయలతో గుంతలు పూడ్చిన ఆర్‌అండ్‌బీ శాఖ నాణ్యతకు తిలోదకాలు ఇవ్వడంతో కురుస్తున్న వర్షాలకు గుంతలు యథాస్థితికి చేరాయి. దీంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. నిత్యం ఇదే రహదారిపై ద్వారకాతిరుమల పుణ్యక్షేత్రానికి తమ ద్విచక్ర వాహనాలపై రాకపోకలు సాగిస్తున్నారు. పలు డిపోల బస్సులు ప్రయాణిస్తున్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డు గుంతలతో నిండిపోయింది. ఈ రోడ్డుపై పాలకులు, అధికారులు తమ వాహనాలపై ప్రయాణిస్తున్నారు. అయినా ఇంతగా రోడ్డు ఛిద్రమైనా గుంతలతో నిండినా తట్ట మట్టి కూడా వేయని పరిస్థితి ఏర్పడింది. కాంట్రాక్టర్ నిర్వహణ పనులు చేపట్టాల్సి ఉన్నా, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

క్లుప్తంగా

ఘనంగా ప్రపంచ ఓజోన్ దినోత్సవం


ఓజోన్ ఆకారంలో ప్రదర్శిస్తున్న విద్యార్థులు

దెందులూరు: సూర్యుడి నుంచి వచ్చే అతినీలలోహిత కిరణాలు నేరుగా భూమిపై పడనివ్వకుండా ఓజోన్ పొర అడ్డుకుంటుందని దెందులూరు బీఆర్‌డీ నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు అన్నారు. మంగళవారం దెందులూరు నర్సింగ్ కళాశాలలో ప్రపంచ ఓజోన్ దినోత్సవ ప్రదర్శన అవగాహన సమావేశం నిర్వహించారు. నర్సింగ్ ప్రథమ ద్వితీయ విద్యార్థినులు ఓజోన్ ఆకారంలో ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జోన్‌కు రంధ్రం పడినట్లు 1980లో శాస్త్రవేత్తలు గుర్తించారన్నారు. ఓజోన్ పొరను ఎలా రక్షించుకోవాలనే విషయాలపై జాగ్రత్తలు తీసుకోవాలని సెప్టెంబర్ 16న ప్రపంచ ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తామన్నారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమాలే శరణ్యం


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

గణపవరం: మన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలపై ఒత్తిడి తేవడానికి ఆందోళనలే శరణ్యమని, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఉపాధ్యాయులు ఉద్యమాలకు సిద్ధం కావాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం గణపవరం బాలికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో ఆయన రణభేరి కార్యక్రమానికి తరలి రావాలంటూ పిలుపునిచ్చారు. అనంతరం రణభేరి పోస్టర్లను ఆవిష్కరించారు. సమస్యలు పరిష్కరిస్తారని ఎదురుచూసి గత్యంతరంలేని పరిస్థితులలో రోడ్డెక్కవలసి వస్తుందన్నారు. కార్యక్రమంలో స్థానిక యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి


చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ, ఎస్సైలు

భీమడోలు: మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని భీమడోలు సీఐ యూజే విల్సన్ అన్నారు. మంగళవారం భీమడోలులోని పలు ప్రాంతాల్లో శక్తి టీం సభ్యులు, ఎస్సై వై.సుధాకర్‌తో కలిసి సీఐ యూజే విల్సన్ గస్తీ నిర్వహించారు. అనుమానస్పదంగా తిరుగుతున్న వ్యక్తులపై నిఘా పెట్టారు. అనంతరం రద్దీగా ఉన్న భీమడోలు బస్టాండ్‌లోని మహిళలు, బాలికలు, యువతులకు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ఎవరైనా వేధింపులకు పాల్పడితే డయల్ 112, 181కు కాల్ చేయాలని కోరారు. కార్యక్రమంలో పోలీసులు, శక్తి టీం సభ్యులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఉపాధి పనులు


సామాజిక తనిఖీ చేస్తున్న డ్వామా పీడీ

గణపవరం: ఉపాధి హామీ పనులు పారదర్శకంగా, సక్రమంగా నిర్వహించాలని డ్వామా పీడీ సీహెచ్ అప్పారావు అన్నారు. మంగళవారం గణపవరం మండల పరిషత్ కార్యాలయంలో మండల వ్యాప్తంగా గత ఏడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకూ జరిగిన ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల వారీగా జరిగిన పనులపై తనిఖీ చేశారు. మొత్తం మీద రూ.13 వేల అపరాధ రుసుం వసూలుకు, 28,694రూపాయల రికవరీకి ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జరిగిన పనుల నిర్వహణపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంపీడీవో బేబీ శ్రీలక్ష్మి, గణపవరం ఏపీఎం సుమలత, ఎస్ఆర్‌పీలు, డీఆర్‌పీలు పాల్గొన్నారు.

క్రీడా పోటీలకు సన్నాహాలు

పెదపాడు: మండలంలో పాఠశాల క్రీడా పోటీలు సక్రమంగా నిర్వహించాలని పెదపాడు మండల విద్యాశాఖాధికారి సబ్బితి నర్సింహమూర్తి తెలిపారు. పెదపాడు మండలంలోని మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో మండలంలోని వ్యాయామ ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ సమర్థవంతంగా నిర్వహించాలని వారికి సూచించారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని వారికి సూచించారు.

పర్యావరణంపై అవగాహన అవసరం


పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

గణపవరం: విద్యార్థి దశ నుంచే పర్యావరణ పరిరక్షణపై అవగాహన కలిగించాలని ఈ దిశగా ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా కృషి చేయాలని ఎంఈవో గొర్రెల బాలయ్య అన్నారు. మంగళవారం స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమంలో భాగంగా మండల వ్యాప్తంగా అన్ని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, కళాశాలల విద్యార్థులతో స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమం 15రోజుల పాటు కొనసాగనుంది.

ఆలయ కమిటీ చైర్మన్‌గా హనుమంతరావు

ఉంగుటూరు: ఉంగుటూరు భీమేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా నారాయణం హనుమంతరావు నియమితులయ్యారు. ధర్మకర్తలుగా కె.చంద్రశేఖర్, టి.వెంకటేశ్వరరావు, ఆర్.వెంకట సాయిలక్ష్మి, బి.నాగమణి, ఎస్.పద్మావతి, ఆర్.భారతి, జి.నామ్మారావు, పి.యువకృష్ణ నామినేట్ చేయబడ్డారు. హనుమంతురావు రెండో సారి చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ధర్మరాజు, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు కూటమి నాయకులు పాల్గొననున్నారు.

జాతీయ విపత్తులపై శిక్షణకు ఎంపీడీవో

ఉంగుటూరు: జాతీయ విపత్తుల శిక్షణకు ఉంగుటూరు ఎంపీడీవో రాజ్‌మనోజు వెళ్లారు. ఐదు రోజుల పాటు అమరావతిలో జరిగే ఈ శిక్షణకు 15 నుంచి 20వ తేదీ వరకు ఉంటుంది. ఇప్పటికీ రెండు రోజులు పూర్తయింది. మరో మూడు రోజులు ఉంది. భూకంపాలు, వరదలువంటి జాతీయ విపత్తులు సంభవించినపుడు చిన్న పిల్లలు, మహిళలను ఎలా రక్షించాలనే విషయాలపై శిక్షణ ఇస్తున్నారు.

గో ఆధారిత వ్యవసాయమే శ్రీరామరక్ష


సదస్సులో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యులు పాకా సత్యనారాయణ, ప్రతినిధులు

ఉంగుటూరు: గో ఆధారిత వ్యవసాయ ఉత్పత్తులే సమాజానికి శ్రీరామ రక్ష అని రాజ్యసభ సభ్యులు పాకా సత్యనారాయణ అన్నారు. మంగళవారం నాచుగుంట గోపాలకృష్ణ గోశాల వద్ద పకృతి వ్యవసాయ ఉత్పత్తిదారుల సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు గో-ఆధారిత పకృతి వ్యవసాయదారులు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రామకృష్ణంరాజు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న పాకా సత్యనారాయణ మాట్లాడుతూ పకృతి వ్యవసాయ విధానాలకు రైతులు అలవాటు పడాలని హితవు పలికారు. రసాయనిక ఎరువులు వాడకానికి రైతులు స్వస్తి పలకాలన్నారు. ప్రస్తుతం రసాయనిక ఎరువులు వాడటంతో పండించిన ఉత్పత్తులు తినడం వలన అనేక రుగ్మతలకు గురవుతున్నారని, ఆసుపత్రులు ఏవీ ఖాళీలేకుండా ఉన్నాయని అన్నారు. భూమిని బలోపేతం చేయాలన్నారు. గోవువలన ఎన్నిలాభాలో వక్తలు వివరించారు. ఈ సమావేశంలో గోశాల కమిటీ కార్యదర్శి పరిమి రాఘవులు, బ్రహ్మంగారి మఠం ఆలానంద ఆశ్రమం స్వామిజీ పూజ్యశ్రీ విరజానంద స్వామీజీ, గో-ఆధారిత పకృతి వ్యవసాయదారుడు ఉప్పలపాటి చక్రపాణి, పకృతి వ్యవసాయం జిల్లా ప్రాజక్టు మేనేజర్ బాలిన వెంకటేష్, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ (ఏపీసీఎన్ఎఫ్) యలమంచిలి నూకరాజు, తూర్పు గోదావరి జిల్లా (ఏపీసీఎన్ఎఫ్) మేనేజర్ బొర్రా తాతారావు, గ్రామ వికాస్ అఖిల భారత సయోజకులు అపరనీయ గురురాజ్, పకృతి వ్యవసాయం చేసే రెండు జిల్లాల రైతులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు భీమడోలు క్రీడాకారులు


క్రీడాకారులకు ప్రశంసా పత్రాలు అందజేసి, అభినందిస్తున్న హెచ్ఎం పద్మజ

భీమడోలు: భీమడోలు జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడాకారులు పలు క్రీడాంశాల్లో ప్రతిభను చాటారు. రాష్ట్ర స్థాయి పోటీలకు 8 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. ఏలూరులోని అల్లూరి సీతారామరాజు స్టేడియంలో ఈ నెల 15వ తేదీన జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో అండర్-14 బాలికల విభాగంలో 60 మీటర్ల లాంగ్ జంప్‌లో ఎం.ఉమాలక్ష్మి ప్రథమ స్థానం, 600 మీటర్ల పరుగులో ద్వితీయ స్థానాన్ని సొంతం చేసుకుంది. అదే విధంగా బాలుర విభాగంలో 60 మీటర్లు, 600 మీటర్ల లాంగ్ జంప్‌లలో పి.ఆదిత్య ప్రథమ స్థానాన్ని సాధించాడు. 60 మీటర్లు, 600 మీటర్ల, బ్యాక్ త్రోల్లో ప్రథమ స్థానం పొందాడు. అండర్-16 విభాగంలో 60 మీటర్లు, 600 మీటర్లు పరుగులో దాసరి జయశ్రీలక్ష్మి ప్రథమ స్థానం, 600 మీటర్ల పరుగులో బి.రాహుల్ ద్వితీయ స్థానం, షాట్‌పుట్‌లో ఎస్.హర్షిత ద్వితీయ స్థానం, జావలెన్‌త్రోలో వి.రాజ్యలక్ష్మి ప్రథమ స్థానం, జావలెన్‌త్రోలో ఎస్.హర్షిత ద్వితీయ స్థానాన్ని పొంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 27, 28, 29వ తేదీల్లో ఏలూరులో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఈ క్రీడాకారులు పాల్గొంటారని హెచ్ఎం జీఎస్ పద్మజ, పీడీ వై.త్రిపుర సుందరిలు తెలిపారు. భీమడోలు ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో క్రీడాకారులకు ప్రశంసా పత్రాలను అందించి హెచ్ఎం జీఎస్ పద్మజ, పీడీలు త్రిపుర స్వాతి, సురేష్‌బాబు, డీఎల్ఎస్ శేఖర్ అభినందించారు.

ఆగడాల లంక క్రీడాకారులు ప్రతిభ

ఆగడాల లంక ఓరియంటల్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు జిల్లా స్థాయిలో తమ సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం టి.మీనాకుమారి, పీడీ ఎంఎస్‌వీడీ ప్రసాద్ మంగళవారం తెలిపారు. అండర్ 16 బాలికల విభాగంలో షాట్‌పుట్‌లో వై.ఏంజిల్ (ప్రథమ స్థానం), బాలుర విభాగంలో లాంగ్‌జంప్‌లో జి.నవీన్ (ప్రథమ స్థానం), షాట్‌పుట్‌లో జి.హరికృష్ణ(తృతీయ స్థానం) సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వారు తెలిపారు.

వేధింపుల నుంచి రక్షించాలని ఎస్పీకి వినతి


ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసిన బాధితులు

పెదవేగి: రాజకీయ అండతో తమను వేధిస్తున్నారంటూ ఓ బాధిత కుటుంబం జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్‌కు ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దెందులూరు నియోజకవర్గం పెదవేగి గ్రామానికి చెందిన తాతా నాగమణి, దివ్యాంగుడైన అమె భర్త మాణిక్యాలరావుపై 2022 అదే గ్రామానికి చెందిన రేలంగి వంశీ హత్యాయత్నం చేశాడనే కేసులో పెదవేగి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో రేలంగి వంశీ ఏ1, ఏ2గా మోర్ల విశ్వేరరావు కోర్టు వాయిదాలకు తిరుగుతున్నారు. ఈ సెప్టెంబర్ 3న ఏలూరు కోర్టులో రాజీ ప్రయత్నాలు జరిగాయని అందుకు అంగీకరించినట్లు బాధితులు తెలిపారు. మరుసటి రోజు మాణిక్యాలరావు తన పొలంలో పని చేసుకుంటుండగా రేలంగి వంశీ అతడి దగ్గరకు వచ్చి అధికారం మాది, కేసు రాజీ చేసుకుంటావా లేదా నిన్ను చంపేయమంటావా అంటూ భౌతిక దాడికి పాల్పడుతుండగా, స్థానికులు వంశీని మందలించి అక్కడి నుంచి పంపించేశారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. దీనిపై అదే రోజు ఎస్సై కె రామకృష్ణకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశామని ఎస్సై స్పందించలేదన్నారు. 11వ తేదీ రాత్రి వంశీ మీద కేసు రాజీ అవ్వకపోతే మీ ముగ్గురిపై ఎమ్మెల్సీ కేసు నమోదు చేస్తానని ఎస్సై బెదిరించారని జిల్లా ఎస్పీ కె ప్రతాప్ శివ కిషోర్‌కు బాధితులు ఫిర్యాదు చేశారు.

రాష్ట్ర పోటీలకు సీఆర్ఆర్ విద్యార్థులు


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయిన సీఆర్ఆర్ విద్యార్థులను అభినందిస్తున్న పాలక వర్గం

పెదపాడు : జిల్లా జూనియర్ అథ్లెట్ మీట్‌లో సీఆర్ఆర్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనపరిచినట్టు ఆ కళాశాల కరస్పాండెంట్ టాటాజీ, ప్రిన్సిపాల్ సీహెచ్ సతీష్‌బాబు తెలిపారు. ఏలూరులో సోమవారం నిర్వహించిన జూనియర్ అథ్లెట్ జిల్లా మీట్‌లో సీఆర్ఆర్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు 18 ఏళ్లలోపు బాలురు విభాగంలో 200 మీటర్ల రన్నింగ్ పోటీలో కె.దేవకుమార్ స్వర్ణం, ఎస్ చైతన్య రజతం, 400 మీటర్ల విభాగంలో ఎస్ చైతన్య స్వర్ణం, కె.దేవకుమార్ సిల్వర్, డిస్కస్‌త్రో బి.పవన్ మణికాంత స్వర్ణం గెలుపొందారని వివరించారు. 20 ఏళ్లలోపు బాలురు విభాగం షాట్‌పుట్‌లో బిజ పవన్‌కుమార్ స్వర్ణం సాధించారని తెలిపారు. వీరు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయినట్టు వివరించారు. వీటితోపాటు సీఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం జరిగిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనపర్చిన ఎం వీరబాబు జిల్లా జట్టుకు ఎంపికయినట్టు చెప్పారు. అథ్లెట్ మీట్‌లో కళాశాలకు పతకాలు లభించడంతో పీడీ కృష్ణకాంత్‌ను అభినందించారు.

వైఎస్సార్ సీపీని బలోపేతం చేయాలి


నూతన అధ్యక్షులను సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

పెదవేగి: గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు పార్టీని బలోపేతం చేయాలని దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. మంగళవారం పెదవేగి మండలం కొండలరావు పాలెంలోని క్యాంపు కార్యాలయంలో దెందులూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నూతన అనుబంధ విభాగాల అధ్యక్షులతో సమావేశమైన కొఠారు అబ్బయ్య చౌదరి గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడానికి అవసరమైన ప్రణాళికల గురించి చర్చించారు. దెందులూరు నియోజకవర్గంలో నూతనంగా ఎంపికైన పలు విభాగాల అధ్యక్షుల వివరాలను అబ్బయ్య చౌదరి వెల్లడించి, వారికి నియామక పత్రాలు అందించి, సత్కరించారు.

అధ్యక్షుల వివరాలు ఇలా..

1. తానింకి పెద్దిరాజు, యువజన విభాగం, 2 దెందులూరు మహిళ విభాగం అంగడాల సీతారావమ్మ, 3 దెందులూరు రైతు విభాగం చళ్లగొళ్ళ వెంకటేశ్వరరావు, 4 దెందులూరు బీసీ సెల్ మట్టా రమా శంకర్, 5 దెందులూరు ఎస్సీ సెల్ మద్దాల నాగయ్య, 6 దెందులూరు ఎస్సీ సెల్ నాగులపల్లి రంగారావు. 7 మైనార్టీ సెల్ షేక్ మీరా, 8 క్రిష్టియన్ మైనార్టీ సెల్ పీవీ రాజు, 9 స్టూడెంట్ వింగ్ పత్యాల సురేంద్ర, 10 పంచాయతీ రాజ్ వింగ్ గుత్తా ప్రసాద్, 11 ఆర్‌టిఐ వింగ్ కొంగ రత్నం కుమార్, 12 వాలంటీర్ వింగ్ చల్లారి గోపి కిశోర్, 13 గ్రీవెన్సెల్ బుద్దాల శ్రీనివాసరావు, 14 వాణిజ్య విభాగం గంగిరెడ్డి కృష్ణాంజనేయులు, 15 వ్యూవర్స్ వింగ్ ఆకురాతి శేఖర్, 16 వైఎస్సార్‌టీయూసీ శింగవరపు సూర్యనారాయణ, 17 అంగన్‌వాడీ విభాగం మోతేపల్లి రాజ్యలక్ష్మి, 18 లీగల్ సెల్ యర్రా సురేష్, 19 కల్చరల్ విభాగం గంటసాల ప్రభాకరరావు, 20 సోషల్ మీడియా విభాగం సిరిపురపు రాజేష్, 21 ఐటీ విభాగం అక్కినేని గోపి, 22 దివ్యాంగుల విభాగం కాటనేని తులసిరామ్, 23 డాక్టర్ విభాగం గారపాటి రమేష్, 24 ఇంటలెక్చువల్స్ ఫోరం బోయపాటి గణేష్, 25 ఎంప్లాయిస్. పెన్షనర్స్ విభాగం రాచూరి బాలస్వామి, 26 బూత్ కమిటీ విభాగం తలారి రామకృష్ణ, 27 పబ్లిసిటీ విభాగం తోట పద్మారావు నియమితులయ్యారు.

సమాజ సేవలో విద్యార్థులు భాగం కావాలి


లైన్స్ క్లబ్ నూతన సభ్యులను మెమొంటోలతో సత్కరిస్తున్న దృశ్యం

పెదవేగి: సమాజ సేవలో విద్యార్థులు భాగం కావాలని లయన్స్ క్లబ్ గవర్నర్ ఎన్‌వీఎస్ పాపారావు నాయుడు అన్నారు. పెదవేగి మండలం దుగ్గిరాల సెయింట్ జోసెఫ్ దంత కళాశాలలో లయన్స్ క్లబ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కళాశాలలో నూతన కార్యవర్గాన్ని ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి లయన్స్ క్లబ్ గవర్నర్ ఎన్‌వీఎస్ పాపారావు నాయుడు హాజరయ్యారు. నూతన కార్యవర్గ అధ్యక్షుడు చందు శ్రీఖర్, సెక్రటరీ కీర్తన, ట్రెజరర్ జి.రోహిత్ పేద మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్ కృష్ణంరాజు, కాకరాల వేణుబాబు, జి.మోజెస్, సీహెచ్ అవినాష్ రాజు, అనిల్ కుమార్, ఎ.శేష్‌కుమార్, మురళి పాల్గొన్నారు.

మానవాళి మనుగడకు ఓజోన్ ఆధారం

గణపవరం: మానవాళి మనుగడకు ఓజోన్ పొరను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపైన ఉందని గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ పి.నిర్మలకుమారి అన్నారు. మంగళవారం గణపవరం డిగ్రీ కాలేజీలో ఎకోక్లబ్, సైన్స్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో ప్రపంచ ఓజోన్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఓజోన్ పరిరక్షణపై గత 14వ తేదీన జాతీయ స్థాయిలో నిర్వహించిన క్విజ్ పోటీలో ప్రథమ బహుమతి గెలుచుకున్న విద్యార్థిని పి.భారతిని అధ్యాపకులు అభినందించారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ ఓజోన్ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ స్వరూపరాణి, ఐక్యూఏసి కోఆర్డినేటర్ గణేష్‌కుమార్, సైన్స్ అసోసియేషన్ కన్వీనర్ శ్రీనివాసరావు, ఎకోక్లబ్ కన్వీనర్ షేక్ పర్వీన్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతో భద్రత

దెందులూరు: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా కృషి చేయాలని గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.నతానియేలు అన్నారు. మంగళవారం వ్యాయామ కళాశాలలో మొక్కలను నాటించారు. పర్యావరణాన్ని మనం రక్షిస్తే పర్యావరణం మనల్ని రక్షిస్తుందని ఈ రెండు విషయాల్లో ఎటువంటి బ్యాలెన్స్ తప్పితే ప్రమాదమన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

తెలుగు భాషపై అతిథి ఉపన్యాసం


అధ్యాపకుడు విజయానందను సత్కరిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: నారాయణపురం, శ్రీ అరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం వ్యవహారిక భాషగా తెలుగు అనే అంశంపై అతిథి ఉపన్యాసం నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ రోజు విద్య, విజ్ఞానం సామాన్య ప్రజలకు అందుబాటులోకి వచ్చిందంటే ఆనాడు గిడుగు రామమూర్తి పంతులు, తదితరులు చేసిన కృషి ఫలితం అన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డి.రెడ్డయ్య, అధ్యాపకులు కొండా రవి, నిర్మల జ్యోతి, పి.బాబురావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులను ఆదుకోవాలి

భీమడోలు: స్త్రీ శక్తి పథకంతో ఆటో వాలాల జీవనోపాధికి తీవ్ర విఘాతం కలుగుతుందని ఆదుకోవాలని గాజువాక నుంచి అమరావతికి సైకిల్‌పై బయలుదేరిన ఆటో డ్రైవర్ సిరియాల హరేరామ్ మంగళవారం భీమడోలు చేరుకున్నాడు. ఆతడికి భీమడోలు శ్రీవేంకటేశ్వర ఆటో ఓనర్స్ అండ్ వర్కర్ల యూనియన్ నాయకులు స్వాగతం పలికారు. 400 కిలోమీటర్ల దూరాన్ని ప్రయాణించారు. ఈ నెల 20వ తేదీన విజయవాడకు చేరుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు గునుపూరి దిలీప్‌కుమార్, డి.అశోక్‌కుమార్, రాచేటి యోహాన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యానికి స్వస్థనారీ స్వశక్తి పరివార్

దెందులూరు/భీమడోలు/పెదపాడు: మహిళలు, బాలికల సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణ, అభివృద్ధి సంక్షేమమే లక్ష్యమని పలువురు వక్తలు అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న స్వస్థనారీ స్వశక్తి పరివార్ కార్యక్రమం ప్రారంభమవుతుందని గోపన్నపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాకేష్ అన్నారు. మంగళవారం గోపన్నపాలెం పీహెచ్‌సీలో ఎంపీహెచ్ఓ సత్యనారాయణ, పీహెచ్ఎన్, ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. పథకం లక్ష్యాలు, నిబంధనలు, సత్ఫలితాల సాధనకు కృషి చేయాలని కోరారు.